


# కరపత్రం

SINCE 2014

ఆదివారం మే 25 2025 | సంపుటి :0 | సంచిక :222 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించండి

### కుమారస్వామికి సిఎం రేవంత్ వినతి



న్యూఢిల్లీ,మే24: హైదరాబాద్‌కు మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం భేటీ అయ్యారు. ఇటీ-వల హైదరాబాద్‌కు 2000 ఈవీ బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎం-ఈ డ్రైవ్ పథకం కింద అదనంగా 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వహణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు రెట్రోఫిటె-డ్ చేపట్టగా అది సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రో ఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



## దేశంలో కొత్త కొవిడ్ వేరియంట్లు.. వెల్లడించిన ఇన్సాకాగ్

కరోనా వైరస్ గురించి పూర్తిగా మర్చిపోతున్న తరుణంలో మరోసారి పంజా విసురుతోంది. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వైరస్ కేసులు వెలుగు చూస్తున్నాయి. కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడగా.. ఎల్‌ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులు మేలో గుర్తించినట్లు తెలిపింది. అవి తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి.

2లో..

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మాది కీలక భూమిక



» ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంత లక్ష్యాలు
» అందుకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్
» నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగం

**అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక**

న్యూఢిల్లీ,మే24: వికసిత భారత్ లక్ష్య సాధన మనందరి ఆశయం. అందులో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని మా ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని సీఎం ప్రకటించారు. తెలంగాణ రైజింగ్ విజన్ లోని నాలుగు కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, వరల్డ్ క్లాస్ ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. 2047 నాటికి మన భారత దేశాన్ని సూపర్ పవర్ గా, నెంబర్ వన్ గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు.'వికసిత భారత్' ప్రణాళికను రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రధాని మోడీ అధ్యక్షతన 11వ నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. 1971లో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్థాన్ ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను గుర్తు చేశారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు, ఎస్సీల ఉప వర్గీకరణకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను సిద్ధం చేసి కార్యాచరణలో పెట్టినట్లు- చెప్పారు. అభివృద్ధిలో, సంక్షేమంలో ఆయా వర్గాలకు న్యాయమైన వాటా ఇవ్వాలన్నది తమ సంకల్ప మన్నారు. అందుకే తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన చేపట్టాం. బీసీలకు విద్య, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ.. ఈ రెండు చరిత్రాత్మక నిర్ణయాలను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. దేశవ్యాప్త కుల గణనకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. కులగణనలో తెలంగాణ అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2028 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర ఉండేలా విధానాలు రూపొందించినట్లు- సీఎం ప్రకటించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట ఎస్సై



మేడ్చల్ మల్కాజ్ : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు ఓ ఎస్సై. పెళ్లిళ్లకు బ్యాండ్ వాయించే బ్యాండ్ ట్రూప్ నుంచిలంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు దొరికాడు. వివరాల్లోకి వెళితే..ఓ బ్యాండ్ ట్రూప్ నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్. బల్కంపేటకు చెందిన హరికమల్ బ్యాండ్ సిబ్బంది జగద్గగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ శుభకార్యానికి హాజరై బ్యాండ్ వాయించారు.

## తెలంగాణలో నిరంతరాయ విద్యుత్ సరఫరా



మిగతాది 2లో

హైదరాబాద్: తెలంగాణలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ రంగంలో రాష్ట్ర పురోగతి, ప్రణాళికలను వివరిస్తూ, ఇంధన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం, సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిలో వేగంగా ముందుకెళ్తున్నామని, దీనిపై కేంద్రం, రాష్ట్రాలు కలిసి ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. బెంగళూరులో శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన కేంద్ర విద్యుత్ మంత్రుల ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో భట్టి మాట్లాడారు.

## మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది

» మా పార్టీలోనూ రేవంత్ కోవర్టులు ఉంటే ఉండొచ్చు
» అంతర్గత విషయాలు బయట మాట్లాడడం సరికాదు
» పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదు
» కవిత లేఖపై మీడియా సమావేశంలో స్పందించిన కెటిఆర్



హైదరాబాద్,మే24: పార్టీ అధినేతకు సూచనలు చేయాలనుకుంటే లేఖలు రాయవచ్చునని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత లేఖపై కెటిఆర్ స్పందించారు. అంతర్గతంగా మాట్లాడే అంశాలు బయట మాట్లాడటం సరికాదని, పార్టీలో అందరం కార్యకర్తలమే..ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, కోవర్టులు సమయం వచ్చినప్పుడు వారే బయటపడతారని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, తమ పార్టీలోనూ సిఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చునని అన్నారు.

## గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే చూస్తారా?

» బనకచర్లకు అనుమతితో తెలంగాణకు బిజెపి ద్రోహం
» దీనిపై వెంటనే కేంద్రాన్ని, ఎపిని నిలదీయాలి
» మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్,మే24: తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ, గోదావరి జలాలను ఎత్తుకు పోయేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు ఏం చేస్తున్నట్లని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు.



మిగతాది 2లో


## కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు.. భారీగా ట్రాఫిక్ జాం.

కాళేశ్వరం... సరస్వతీ పుష్కరా లకు జనం పోటెత్తుతున్నారు. మద్దులపల్లి -కాళేశ్వరం మధ్యలో 8 కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. గంటల తరబడి ట్రాఫిక్? జామ్ కావడంతో భక్తుల ఇబ్బందులు పడుతున్నారు. సరస్వతీ పుష్కరాలకు సోమవారం (మే 26) చివరి రోజు కావడంతో భక్తులు బారులు తీరుతున్నారు. పుష్కరాలు ముగింపు దశకు చేరు కోవడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. కాళేశ్వరం పుష్కరానికి వెళ్లిన భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో కొంతమంది ప్రయాణికులు కాలినడకన పుష్కర ఘాట్లకు చేరుకుంటున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్నారు. కాళేశ్వరానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు.



2 లో

## శ్వేతసౌధంలో మళ్లీ 'పంచాయితీ'



అతిథుల్ని పిలిచి బహిరంగంగా వాగ్యుద్ధానికి దిగటం ఏ రకంగా దౌత్యనీతి అవుతుందో, దాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ నేర్చారో ఎవరికీ తెలియదు. కానీ ఆయన దాన్ని కొనసాగించదల్చుకున్నారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో వైట్‌హౌస్‌లో తాజాగా సాగిన జగడం నిరూపిస్తోంది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఇదే మాదిరి తగువు పెట్టుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో తప్పంతా ఉక్రెయిన్‌దే అన్నట్టు తేల్చి, దాన్ని వెంటనే నిలిపేయాలని ఒత్తిడి తెచ్చారు.అడుగడుగునా అవమా నిస్తూ మాట్లాడారు. మళ్లీ మూణ్ణెల్లకు అదే వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆ డ్రామాకే తెరతీశారు. నిజానికి ఇరు దేశాల అధినేతలు కలుసుకుని చర్చించినాక వారిద్దరూ కలిసి మాట్లాడే మీడియా సంయుక్త సమావేశం లాంఛనప్రాయమైనది. నాలుగు గోడలమధ్యా నిర్మొహమాటంగా మాట్లాడుకున్నా, వాదులాడుకున్నా... మీడియా సమావేశంలో పరస్పరం ప్రశంసించుకోవటాలు, రెండు దేశాల మధ్యా కుదిరిన ఒప్పందాల విశిష్టతను అతిగా చూపించుకోవటాలు జరిగిపోతాయి. ఇందువల్లరెండు దేశాల్లోనూ అధినేతలకు ప్రశంసలు దక్కుతాయి.కానీ ఇలాంటివి ట్రంప్‌కు పట్టవు. ప్రపంచానికి తాను మకుటంలేని మహారాజునని, ఎవరినైనా ఏమైనా అనగలనని అమెరికా శ్వేతజాతి ఓటరు మహాశయులకు ఆయన చెప్పదల్చుకున్నారు.అందుకే అతిథులుగా వచ్చిన అధినేతలను కెమెరాల ముందు ఇష్టానుసారం మాట్లాడటం అల వాటు చేసుకున్నారు. పోనీ ఆయన నిలదీస్తున్న అంశాలు గొప్పవేమీ కాదు. వాటిల్లో చాలామటుకు నకిలీవీ... నిరాధారమైనవీ. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరో పెట్టే తప్పుడు పోస్టింగులే వాటికి ఆధారం.ఉక్రెయిన్‌లో దేశాధినేతను మార్చి, ఆయన ద్వారా రష్యాను చీకాకుపెట్టి చివరకు అది రెచ్చిపోయి దాడిచేసే స్థితి కల్పించింది అమెరికాయే. అటు తర్వాత రష్యాను ప్రపంచంలో ఏకాకిని చేయటానికి ప్రయత్నించి, ఉక్రెయిన్‌కు పెద్దయెత్తున ఆయుధాలు అమ్ముకున్నది అమెరికాయే. నాటో దేశాలను సైతం ఈ రొంపిలోకి దించింది కూడా ఆ దేశమే. జో బైడెన్ హయాంలో ఇవన్నీ జరిగినట్టు తెలిసినా, ట్రంప్ ఏమీ తెలియనట్టు నటించారు. ఉక్రెయిన్‌నే వేలెత్తి చూపారు. ఇప్పుడు రాంఫోసాతో సైతం అదే తరహాలో వ్యవహారం నడిపారు.దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల ఊచకోత సాగుతున్నదనీ, వాటిల్లో చాలాభాగం బయటకు రావటం లేదనీ ట్రంప్ వాదించారు. ఒకప్పటి శ్వేతజాతి పాలనలో నల్లజాతీయులపై అఘాయి త్యాలు జరిగాయని ఒప్పుకుంటూనే ఇప్పుడు నల్లజాతి పాలనలో శ్వేతజాతీయుల్ని ఆ మాదిరేహింసిస్తున్నారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఆధారాలున్నాయా అని రాంఫోసా అడిగితే, లేవని అంగీ కరిస్తూనే ట్రంప్ ఒక వీడియో ప్రదర్శించారు. అందులో నల్లజాతి వామపక్ష నాయకుడు జూలియస్ మలేమా 'శ్వేతజాతి ఆఫ్రికన్లను హతమార్చండ'ంటూ నినాదాలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. మొత్తం గంటసేపు జరిగిన ఈ మీడియా సమావేశంలో రాంఫోసా ఎక్కడా ఆవేశానికి పోకుండాఎంతో సంయమనంతో ట్రంప్‌కు జవాబిచ్చే ప్రయత్నం చేశారు.నిజానికి దక్షిణాఫ్రికాలో ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు 8 శాతంకన్నా తక్కువ జనాభాగల శ్వేతజాతీయుల చేతుల్లో వున్నాయి. జనాభాలో 80 శాతంగా వున్న నల్లజాతీయులకు వ్యవసాయ భూముల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. కానీ ట్రంప్ మాత్రం దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతీయుల భూముల్ని గుంజుకుని వాటిని నల్లజాతీయులకు పంచు తున్నదని ఆరోపించారు. శ్వేతజాతి దురహంకార పాలనలో నల్లజాతీయుల నుంచి అక్రమంగా చేజిక్కించుకున్న భూములు వెనక్కిప్పించాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించటం లేదు.దానికి బదులు స్వచ్ఛందంగా అమ్మటానికి సిద్ధపడే శ్వేత జాతీయులకు పలు రాయితీలిస్తున్నది. శ్వేతజాతి రైతుల ఊచకోత సాగుతున్నదన్న ట్రంప్ వాదన కూడా పూర్తి అబద్ధం. నేరాల రేటు చూస్తే ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ముందుంది. అక్కడ సగటున రోజుకు 72 హత్యలు జరుగుతాయి. ఆరుకోట్ల జనాభాగల ఆ దేశంలో హతుల్లో అత్యధికులు నల్లజాతీయులు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుడు 26,232 మంది హత్యకు గురైతే అందులో కేవలం 8 మంది మాత్రమే శ్వేతజాతి రైతులు. వాస్తవాలు ఇవికాగా ట్రంప్ వైట్‌హౌస్ వేదికగా ఒక దేశాధినేతపై ప్రపంచమంతా చూస్తుండగా దబాయించటం ఎంత దారుణం!నిజానికి రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సినవి చాలావున్నాయి. శ్వేతజాతి రైతుల ఊచకోత ప్రచారాన్ని నమ్మటంతో బైడెన్ హయాంలోనే నిధులు ఆపేశారు. ట్రంప్ వచ్చాక 25 శాతం సుంకాల విధింపును ప్రకటించారు. ఆ దేశంలోని సహజ వనరులపై ట్రంప్ కన్నుపడింది. వీటిపై అర్థవంతమైన చర్చలు జరగకుండానే తప్పుడు ప్రచారంపై వాదులాట సాగింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచ కోతపై ధైర్యంగా అంతర్జాతీయ న్యాయస్థానం తలుపుతట్టింది దక్షిణాఫ్రికాయే. రాంఫోసా అదృష్టం బాగుండి ట్రంప్‌కు ఆ సంగతి గుర్తురాలేదు. లేకుంటే మరింతగా విరుచుకుపడేవారు. వర్తమాన ప్రపంచంలో పలు దేశాధినేతలు తప్పుడు సమాచారాన్నీ, వదంతుల్నీ ప్రచారంలో పెట్టి అధికారంలోకొచ్చినవారే. ఈ ఎత్తుగడలే మరోసారి అందలం ఎక్కిస్తాయని... రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధ్యక్షుడు కావాలని కలగంటున్న ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఇలాంటపుడు అమెరికాలో అడుగుపెట్టడానికీ, ట్రంప్‌తో చీవాట్లు తినటానికీ ఏ దేశాధినేతయినా ధైర్యం చేయగలరా?

## మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది

మొదటిపేజీ తరువాయి
లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం.. అసెంబ్లీలో ఓడిపోయాం.. ఎలా ముందుకు పోవాలని 17 రోజుల పాటు– వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలా మంది డైరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వారు ఉన్నారు. కొంత మంది చిట్టీల మీద రాసిచ్చిన వారు ఉన్నారు. కొంత మంది కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని ఉత్తరాలు ఇచ్చిన వారు ఉన్నారు. మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు చేయాలను కుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమోక్రసీ ఉంది కాబట్టి.. సూచనలు సలహాలు చేస్తూ అధ్యక్షుడికి లిఖిత పూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీలో ఏ హోదాలో ఉన్నా.. అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటది. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది.. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.. వారిని కూడా కలిసే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటు–ంది.. ఇది అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు.. అందులో రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని,దెయ్యం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హైకమాండ్ కు డబ్బులిస్తూ రేవంత్ పదవి కాపాడుకుంటున్నారని, ఇడి ఛార్జ్‌షీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. నాడు ఓటుకు నోటు స్కామ్.. ఇది సీటుకు రూటు– స్కామ్ అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. నైతికత ఉంటే ముఖ్యమంత్రి స్వచ్ఛందం గా తప్పుకోవాలని, ఆయన తప్పుకోకుంటే అధిష్టానం తొలగించాలని సూచించారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని చురకలంటించారు. రేవంత్ దిల్లీ వెళ్లి చీకట్లో బిజెపి నేతల కాళ్లు పట్టుకుంటున్నారని, అమిత్ షాను రాత్రి కలిసిన రేవంత్ బయటికొచ్చిగట్టిగా మాట్లాడారని మండిపడ్డారు. నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని అని విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీకి చందాలు అని కెటిఆర్ దుయ్యబట్టారు. బిజెపి ఎంపిల భూదందాలకు సిఎం వత్తాసు పలుకుతున్నారని, బిజెపి నేతలు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. అందుకే నేషనల్ హెరాల్డ్ కేసుపై నేతలు మాట్లాడట్లేదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని అంశాలపై కేంద్రం చర్య తీసుకోవాలని కెటిఆర్ కోరారు. కేంద్రం స్పందన కోసం నెలరోజులు ఎదురు చూస్తామని, నెల తర్వాత పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం అని కెటిఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్.. దయ్యం రేవంత్ రెడ్డి.. ఈ దయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలనేది మా టార్గెట్అన్నారు.

## గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే చూస్తారా?

మొదటిపేజీ తరువాయి
ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 80 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50శాతం నిధులు, మిగతా 50శాతం ఎఫ్ఆర్‌బీఎం పరిధి మించి రుణ సమీకరణకు ఏపీకి అనుమతించడం అన్యాయం, అనైతికం అని హరీశ్‌రావు మండిపడ్డారు. విభజన చట్టం ప్రకారం, కృష్ణా లేదా గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే రివర్ మేనేజ్మెంట్ బోర్డుల అనుమతి అవసరం. కానీ అందుకు విరుద్ధంగా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే అడ్డుకోవాల్సిన కేంద్రం, నిధులిచ్చి సహకరించడం దుర్మార్గం అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయం అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి ఏం లాభమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే, ఎఫ్ఆర్‌బీఎం కింద రికవరీ పెట్టారు, కానీ బనకచర్ల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా 50శాతం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మించి రుణం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. నాటి సమైక్య పాలకులు పోతిరెడ్డిపాడుతో కృష్ణా జలాల అక్రమ తరలింపుకు ప్రణాళిక వేస్తే, నేటి కాంగ్రెస్ నాయకుల సమక్షంలోనే బనకచర్ల ద్వారా గోదావరి జలాల దోపిడికి మార్గం సుగమం చేస్తున్నారు. కేంద్రాన్ని నిలదీయలేరు, ఏపీతో పోరాటం చేయలేరు. చేతగాని ప్రభుత్వం వల్ల తెలంగాణ నష్టపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారాయి. నీతి అయోగ్ సమావేశానికి హాజరవుతున్న ముఖ్యమంత్రి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించి, ఏపీ జల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట ఎస్సై

మొదటిపేజీ తరువాయి
అయితే శబ్ధకాలుష్యానికి పాల్పడుతున్నారంటూ ఎస్సై శంకర్ బ్యాండ్ కు సంబంధించిన వాహనాన్ని సీజ్ చేశాడు. జగద్గిరి గుట్టకు చెందిన మధ్యవర్తి నాగేందర్ ను మధ్యవర్తిగా పెట్టుకొని బ్యాండ్ ట్యాప్ నుంచి 15వేలు లంచం డిమాండ్ చేశాడు. ఎస్సై వేధింపులు భరించలేక బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. శనివారం (మే24) ఉదయం బాధితుడు రూ. 15వేలు మధ్యవర్తి నాగేందర్ కు అందజేశాడు. నాగేందర్ ఆ మొత్తాన్ని ఎస్సై శంకర్?కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అవినీతికి పాల్పడిన ఎస్సై శంకర్, అతనికి సహకరించిన నాగేందర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణలో నిరంతరాయ విద్యుత్ సరఫరా

మొదటిపేజీ తరువాయి
**నెట్‌వర్క్ బలోపేతం**

రాష్ట్రంలోని అంతర్గత విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం ద్వారా పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ వనరులను సమన్వయం చేస్తూ చర్యలు చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. '2034%–%35 వరకు దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు, ఆర్థిక స్థితిని మెరుగుపరిచేలా సరైన ప్రణాళికలు రూపొందించాలి.

ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది'అని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు తెలంగాణ చూపిస్తున్న క్రియాశీలక దృష్టికోణాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరిచే ప్రణాళికలపైనా భట్టి మాట్లాడారు. రాష్ట్రాలు, కేంద్రం కలిసి పనిచేయడం ద్వారా జాతీయ ఇంధన లక్ష్యాలను సాధించవచ్చన్న విషయం ఈ సదస్సులో స్పష్టమైంది. సమావేశంలో కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్, కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యస్సో నాయక్, కర్ణాటక, తమిళనాడు విద్యుత్ మంత్రులు కేజే జార్జ్, శివశంకర్ పాల్గొన్నారు.

## కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు.. భారీగా ట్రాఫిక్ జాం.

మొదటిపేజీ తరువాయి
ఆదివారం ( మే 25) .. సోమవారం పుష్కరాలకు చివరి రోజు కావడంతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. భక్తులకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చలివేంద్రాలు ఏర్పాటుచేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను కూడా పంపిణీ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా కాళేశ్వరంలోనే విడిది చేసి వసతులు, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు. సరస్వతీ పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు కాళేశ్వర క్షేత్రం మొత్తాన్ని ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించడం కోసం అధికారులు హెలీకాప్టర్ జాయ్ రైడ్‌ను యాత్రాదాం.ఓఆర్‌జి ద్వారా అందుబాటులోకి తెచ్చారు.దూర ప్రాంతాల నుంచి భక్తుల ఎలాంటి ఇబ్బందులు పడకుండా పుష్కర ఘాట్ లకు దగ్గర్లోనే టెంట్లు ఏర్పాటు చేశారు. ఒంటరిగా వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా డార్మెటరీ సదుపాయం కల్పించారు. అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన వసతి గృహాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారంతో సరస్వతి పుష్కరాలు ముగియనున్నాయి.వీకెండ్ కావడం.. పుష్కరాల చివరి రోజు కావడంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. త్రివేణీ సంగమ పరిసరాలు ఇప్పటికే జనసంద్రంగా మారాయి. దీంతో ఘాట్ పరిసరాల్లో అదనంగా వాహనపార్కింగ్ స్థలాలను అధికారులు సిద్ధం చేశారు.

## దేశంలో కొత్త కొవిడ్ వేరియంట్లు.. వెల్లడించిన ఇన్సాకాగ్

మొదటిపేజీ తరువాయి
దిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులను గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి దిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాంతో అన్ని ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది .ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్–19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు.దిల్లీలో కేసులతో అక్కడి భాజపా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు ఇమ్యూనిటీ తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మాది కీలక భూమిక

మొదటిపేజీ తరువాయి
మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు, మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ, శిల్పారామంలో 100 స్టాళ్లతో మహిళా బజార్ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. సోలార్ పవర్ జనరేషన్ లోనూ భాగస్వామ్యం కల్పించి మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించే కార్యక్రమాలు అమలు చేశామన్నారు. మన దేశ భవిష్యత్తు మన యువత. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువతదే కీలక పాత్ర. అందుకే యువత ఆశయాల సాధనకు అనుగుణంగా యూత్ పాలసీ అమలు చేస్తున్నాం. 60 వేల ప్రభుత్వ

ఉద్యోగాలు భర్తీ చేశాం, ప్రైవేటు– రంగంలో లక్ష ఉద్యోగాలు సృష్టించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఒకవైపు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్నా మరోవైపు నిరుద్యోగ సమస్య నెలకొంది. నైపుణ్యాల కొరతే ఈ అంతరానికి కారణమని గుర్తించాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ–, స్పోర్ట్స్ యూనివర్సిటీ–, పోలీస్ స్కూల్, ఇంటిగ్రే–టె–డ్ మోడల్ స్కూల్స్, ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి స్కిల్ శిక్షణ ఇస్తున్నామని సీఎం వివరించారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటికి అడ్డుకట్ట వేయటంలో139 దేశాల్లో తెలంగాణ నెంబర్–1 స్థానం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు రూ.5 లక్షల స్వయం ఉపాధి పథకాన్ని జూన్ 2 నుంచి ప్రారంభిస్తామన్నారు. దేశానికి రైతే వెన్నెముక అని, ఆ వెన్నెముక కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం. వారిని అప్పుల ఊబి నుండి బయటకు తేవడం, తిరిగి ఆ ఊబిలోకి జారిపోకుండా నిలబెట్టాలన్న లక్ష్యాలతో పని చేస్తున్నామన్నారు. తెలంగాణలో 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి వారిని రుణ విముక్తులను చేశాం. సాగు కోసం రైతు మళ్లీ అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.12 వేల రైతు భరోసా సాయం చేస్తున్నాం. బియ్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్ కు రూ.500 చెల్లించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నాం. రైతుకు చేదోడుగా ఉండే వ్యవసాయ కూలీకి రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తున్నాం. ఈ రోజు వరి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ గా ఉంది. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచాం. ఈ నేపథ్యంలో రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాక... ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 2047 నాటికి ఇండస్ట్రీ, ఇన్ ఫ్రా విషయంలో అంతర్జాతీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ ఎంచుకున్నట్లు చెప్పారు.ఈ లక్ష్య సాధనలో తొలి అడుగుగా.. ఏడాదిన్నర కాలంలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్ లలో పర్యటించి రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజించి వృద్ధి సాధిస్తామన్నారు. తెలంగాణలో కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాల్లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, మెట్రో రైల్ సెకండ్ ఫేజ్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మాన్యూఫాక్చరింగ్ హబ్, అగ్రిబేస్డ్ పరిశ్రములు ఏర్పాటు– చేస్తామన్నారు. సబర్మతీ రివర్ ఫ్రంట్, గంగా పునరుద్ధరణ ప్రాజెక్ట్ మాదిరిగా తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందని, మెట్రో సెకండ్ ఫేజ్, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులు ప్రస్తుతం డీపీఆర్ ల స్టేజ్ లో ఉన్నాయి. రేడియల్ రోడ్ల నిర్మాణం తెలంగాణ ప్రతిపాదిత డ్రై పోర్ట్ నుండి మచిలీపట్నం పోర్టుకు ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణం తెలంగాణ అభివృద్ధిలో కీలకమవుతాయన్నారు. గుడ్ గవర్నెన్స్ తో అత్యున్నత ప్రమాణాలతో పౌర సేవలను అందిస్తామని , ఇందులో భాగంగా ఇ÷ఖఒరఉ కక్షా యాప్ ద్వారా నిర్మాణ రంగానికి వేగం పెంచినట్లు సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను డేటా సెంటర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. విద్య, వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# ఎస్ఐని సన్మానించిన విండో చైర్మన్ శ్రావణ్

గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి



ఎస్ఐ ని సన్మానిస్తున్న దృశ్యం

జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం ఎస్ఐ అనీల్ ను ఇబ్రహింపట్నం మండలం తిమ్మాపూర్ సహకార సంఘం చైర్మన్ బాస శ్రావణ్ శనివారం శాలువాతో సన్మానించారు.ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవల పట్ల ఇబ్రహింపట్నం మండల ఎస్.హెచ్.ఒ 6వ స్థానంలో రావడం పట్ల అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు క్యాతం తిరుపతి రెడ్డి, బండి రాజేష్,తిప్పిరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాల్సిందే

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయబోమని ప్రకటించడం అర్థరహితమని ఎన్.బి.ఎం.ఐ ( National Banjara Mission India) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రవిరాజు రాథోడ్ విమర్శించారు.ప్రతి విద్యా సంవత్సరం పాఠశాలలో 15 నుంచి 30% వరకు ఫీజులు పెంచుతున్నాయి కానీ పేద విద్యార్థులకు ఉచిత విద్య కల్పించడంలో మాత్రం వెనుకడుగు వేస్తున్నాయని రవిరాజు రాథోడ్ అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి 25 శాతం ఉచిత సీట్లు కేటాయించని విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు.

# మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దు

**నిజాంపేట్ మే 24 కరపత్రం ప్రతినిధి**

మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్. మేరకు శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధ్యక్షతన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్ల లో అభివృద్ధి పనుల పురోగతి పై వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్ల లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికే పలుమార్లు ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టవలసిన చర్యలను అధికారులు చేపట్టి అభివృద్ధి పనులను పూర్తిచేయాలని, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమీషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ ఎమ్మెర్వో, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, విద్యాశాఖ లతో పాటు వివిధ శాఖల అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు...

# ప్రజా సమస్యల పరిష్కారామే ధ్యేయంగా ముందుకు: బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్, మే 24 కరపత్రం ప్రతినిధి**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , దుందిగల్ మున్సిపాలిటీ, శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, కాలనీల సభ్యులు, శనివారం వారి ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ని మర్యాదపూర్వకంగా కలసి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వెంటనే వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు...

# జీడిమెట్ల గ్రామంలో పర్యటించిన బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి

**జీడిమెట్ల మే 24 కరపత్రం ప్రతినిధి**



జీడిమెట్ల గ్రామంలో నెలకొన్న విద్యుత్ స్తంభాల సమస్యపై శనివారం బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పర్యటించారు. ఈ మేరకు వారు జీడిమెట్ల గ్రామంలో ప్రతి గల్లీలో తిరుగుతూ అక్కడ నెలకొని ఉన్న సమస్యపై ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, ఎశ్వంత్, వెంకు, శశి, సిద్దు, శివ, శ్యామ్, లక్ష్మణ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, చిన్న,సోను, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు...

# వదల బొమ్మాళీ వదల.. కరోనా రిటర్న్స్

- చైనోడి పిల్లనురా..నిన్ను చప్పరించి చంపుతరా

-బ్యూరో చీఫ్ వన్నాల శ్రీధర్ తో కలిసి
కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్

**- దేశంలో NB.1.8.1, LF.7 వేరియంట్స్ గుర్తింపు**




కనుమరుగై పోయిందనుకుంటున్న వేళ కరోనా రీ ఎంట్రీ మళ్లీ కలకలం రేపుతోంది. కొత్త రూపంలో పంజా విసురుతోంది. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులే అందుకు నిదర్శనం. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా పట్టణాల్లో కరోనా కేసులు నమోదు అవుతున్నాయి. ఈ క్రమంలోనే.. కరోనా రెండు కొత్త వేరియంట్‌లను ఇండియన్ జీనోమిక్స్ కన్సార్టియం నిపుణులు గుర్తించారు.
భారత్‌లో కోవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం తాజాగా తెలిపింది. దేశంలోనే అత్యధికంగా కేరళలో కరోనా ఇన్‌ఫెక్షన్లు వెలుగులోకి వస్తున్నాయి. కేరళలో 200మందికి పైగా కరోనా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో.. ఆస్పత్రుల్లో మాస్కులు తప్పనిసరి చేసింది కేరళ ప్రభుత్వం. మహారాష్ట్రలోనూ కరోనా కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒక్క ముంబైలోనే ఈ నెలలో 95 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కర్నాటకలో 35 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఢిల్లీలో 24 గంటల్లో 23 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండగా.. నోయిడాలో తొలి కరోనా కేసు రికార్డ్ అయింది. గాజియాబాద్‌లో ఇప్పటికే 4 కేసులు నమోదు అయ్యాయి.
తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ కరోనా కలవరం మొదలైంది. తెలంగాణలో తొలి కరోనా కేసు నమోదైంది. కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కరోనా పాజిటివ్ అని తేలింది. బాధితుడిలో జలుబు, దగ్గు, జ్వరం లాంటి లక్షణాలు గుర్తించారు. అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం.. గాంధీ ఆస్పత్రిలో 25 పడకల వార్డును సిద్ధం చేసింది. కరోనా, సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర సమీక్షనిర్వహించారు. జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదవుతున్నాయి.. పెద్ద ప్రమాదం లేదని అధికారులు వివరించారు. అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామంటూ మంత్రికి అధికారులు తెలిపారు. కరోనాతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి దామోదర ఆదేశించారు. సరిపడా మందులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు.
ఏపీని కూడా కరోనా కేసులు టెన్షన్ పెడుతున్నాయి. విశాఖలో 2 కరోనా కేసులు, కడపలో రెండు కేసులు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అలెర్ట్ అయిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు.. విశాఖ జీజీహెచ్‌లో కరోనా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.
.. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలను కేంద్రం అలెర్ట్ చేసింది. ముందు జాగ్రత్తగా ఆస్పత్రులు సిద్ధం చేయాలని ఆదేశించింది. అయితే.. ఆయా రాష్ట్రాల్లోని కరోనా బాధితులకు కేవలం స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది.

# గ్రామ పంచాయతీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

- ఇబ్రాహీం పట్నం మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి




సిబ్బందికి సన్మానం చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఐడిఓసి లో యున్ సి సి ఇ యఫ్ ప్రాజెక్టు సహకారం తో గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ ల రక్షణ గురించి అవగాహన కోసం, శనివారం మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు , గ్రామ పంచాయతీ సిబ్బంది కి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మన కోసం, మన ఆరోగ్యం కోసం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం కష్టపడి పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవాలని వారు బాగుంటే మనం బాగుంటాం, మనం బాగుంటే మన ఊరు బాగుంటుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరణ్, జిల్లా పంచాయతీ అధికారి మధన్ మెహన్ అన్నారు.

అనతరం సిబ్బందికి సన్మానం చేసి అభినందించారు.

ఈకార్యక్రమంలో ఇబ్రహింపట్నం మండల పంచాయతీ అధికారి రామకృష్ణ రాజు , వేములకుర్తి, ఎర్దండి పంచాయతీ కార్యదర్శులు గుడురు శ్రీకాంత్, మనోజ్ .. గ్రామపంచాయతీ సిబ్బంది కనక రాజం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు అనే కార్యక్రమం

- యుక్త వయసులో ఉన్న యువతి యువకులపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని సూచించారు-
-గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా-

**గజ్వేల్ మే 24,కరపత్రం ప్రతినిధి**




పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు అనే కార్యక్రమం శుక్రవారం రాత్రి గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో నిర్వహించడం జరిగింది గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా అక్కన్నపేట ఈ సందర్భంగా మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న యువతి యువకులపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని సూచించారు స్కూలుకు వెళుతున్నారా కాలేజీకి వెళు తున్నారా ఇంకెక్కడైనా తిరుగుతున్నారా నిఘా ఉంచడం చాలా ముఖ్యమన్నారు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి మోహన్ మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి ఆశ భయము, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి, బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు, అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ డీటెయిల్స్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు సీసీ కెమెరాలు 24 గంటలపాటు ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీని ఇస్తాయని తెలిపారు క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దు మూఢనమ్మకాలు, చేతబడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం సభ్యులు శ్యాంసుందర్, ప్రసాద్, బిక్షపతి, నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు గ్రామ యువతి యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుంది.... కొంతం వెంకటేశం

**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ మే 24**



ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు సుక్షితులైన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొంతం వెంకటేశం అన్నారు. శనివారం ఆయన కబురు ప్రతినిధితో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేయడానికి గ్రామస్థాయిలో విద్యావంతులు, మేధావులు గ్రామాల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా ప్రోత్సహించినట్లయితే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్య అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టడం జరుగుతుందని, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలతో పాటు గురుకులాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, నాణ్యమైన భోజనాన్ని అందిస్తుందన్నారు గ్రామస్థాయిలో తమకు అనువుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించినట్లయితే డబ్బు ఆధా కావడమే కాకుండా, విద్యార్థికి సరైన విద్య అందుతుందన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించడం జరుగుతుందన్నారు.ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు సమీపంలో ఉన్నాయని, పదవ తరగతి ఫలితాల్లో ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు.ప్రభుత్వ పాఠశాలలు గురుకుల పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు క్రీడాల్లో చదువుల్లో రాణించారని అందుకు ఉదాహరణ మలావత్ పూర్ణ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసినట్లయితే విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడినట్లవతుందన్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం...





సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

బోధన్ నియోజకవర్గం సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరం శనివారం తో ముగిసింది. శిక్షణ శిబిరంలో తాము నేర్చుకున్న చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా లను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపిడీఓ శ్రీనివాస్ ముందు విద్యార్థులు ప్రదర్శించారు. వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి తర్ఫీదు అందించిన సిబ్బందికి సాలూర మండల విద్యాశాఖ అధికారి రాజీమంజుష కు ఎంపీడీవో అభినందించారు. 15 రోజులపాటు విద్యార్థులకు చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్ , యోగ శిక్షణలో విద్యార్థులు వారి సామర్థ్యాలను మెరుగుపరుచుకున్నందుకు ఎంఈఓ అభినందించారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వామి, సీఆర్పీ స్వర్ణ, ఆఫీస్ సభార్డినేట్ వనజ, యోగా టీచర్ సౌమ్య, డ్రాయింగ్ టీచర్ సృజన, స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్ అవినాష్ బాబు, సాయిలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కూలి పోయిన కల్వర్టులు పునర్మించాలి...





సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ 4వ వార్డు శ్రీరామాలయం పక్క వీధిలోని సిసి రోడ్డుపై కూలి పోయిన కల్వర్టును పునర్మించాలని శనివారం కాలనీ వాసులు పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాలయం పక్క నుండి గృహ నివాసాలకు వెళ్లేదారిలో ఉన్న రెండు కల్వర్టులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, వాటిని తిరిగి పునర్నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, సబ్ కలెక్టర్ వికాస్ మహాతో లను కోరారు. కురుస్తున్న వర్షాలకు రోడ్డు అంతా బురదమయమై రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతుందని డ్రైనేజీ లోని మురికి నీరు ఇండ్లలోకి వచ్చి చేరి దుర్గంధపూరితమైన వాసన వస్తుందని వాపోయారు. వెంటనే స్పందించి కల్వర్టుల పునర్నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా వినతి ద్వారా కోరారు. వినతి పత్రం అందించిన వారిలో గజపాక సాగర్, ఉదయ్ కిరణ్, కనకయ్య, లక్ష్మణ్, విజయ్, పవన్, సాయి, శివ తదితరులు ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి మహేష్ కుమార్ గౌడ్ కృషి



– రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి...

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల పైన ఉందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు.రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బీసీ నాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తూనే అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న నాయకుడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, డిసిపల్లి అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్,రూరల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమ్మాజీ నరేష్,నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ

– కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...



సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా వచ్చే మూడు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్,జూలై,ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులు కలిగిన వారు ఒకేసారి పొందవచ్చని అన్నారు.ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని,చౌక ధరల దుకాణ డీలర్లు మూడు మసాల కోటాను దిగుమతి చేసుకుని వినియోగదారులకు సకాలంలో బియ్యం కోటా పంపిణీ చేయాలని సూచించారు.జూన్ 01 నుండి 30వ తేదీ లోపు పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.బియ్యం పంపిణీలో అవకతవకలు,అలసత్వానికి తావిస్తే,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.వానాకాలం సీజన్లో సంభవించే వర్షాలు,వరదలు,నిల్వ సమస్యలు తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం నిల్వలు చేరుకునేలా,కార్డు హోల్డర్లకు వారి కోటా మేరకు ఏకకాలంలో మూడు నెలల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులు సక్రమంగా తరలించేలా,బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన పోచారం, కాసుల







కరపత్రం ప్రతినిధి బాన్సువాడ మే 24

బాన్సువాడ పట్టణంతోపాటు మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ పట్టాలను పంపిణీ చేశారు. బాన్సువాడ అర్బన్ కు 260, రూరల్ మండలం 353 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నియోజకవర్గంలో ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు అందించడమే తన లక్ష్యమన్నారు. అనంతరం కోటగల్లీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, హనుమంత్ రావు, డీఎల్పీఓ సత్యనారాయణ, ఎంపీడీవో ముజాహిద్,,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా,నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, జంగం గంగాధర్, ఎజాస్, కాసుల రోహిత్, రహిస్ , కొట్టం గంగాధర్, లింగమేశ్వర్, గొల్ల వెంకన్న యాదవ్, కిరణ్, గౌస్, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పహల్గామ్ హత్యలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలి




సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

పహల్గాంలో పర్యాటకుల హత్యలు,ఆపరేషన్ సింధూర్ లో దాగి ఉన్న నిజాలపై సమగ్ర విచారణ జరిపి,భారత ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు.సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్లో శనివారం జిల్లా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ,గత నెలలో కాశ్మీర్ లోయలో ఉగ్ర దాడి జరిగిందని,దాడి చేసిన వారిని ఇప్పటికి వరకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి పట్టుకోలేదని,ఆపరేషన్ సింధూర్ లో యుద్ధం అర్ధాంతరంగా ముగింపును అమెరికా అధ్యక్షుడు ట్రంపు ప్రకటించడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.అమెరికా సామ్రాజ్యవాద అధినేతకు అధికారం ఎవరిచ్చారని ఆయన నిలదీశారు.ప్రపంచంలో అతి పెద్ద దేశమైన మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారత పార్లమెంటులో కానీ,దేశములోని విపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసి కానీ చర్చించకుండా నేరుగా యుద్ధ విరమణ ప్రకటన ట్రంపు చేయడం,నరేంద్ర మోడీ మౌనవ్రతం పాటించడం పరిశీలిస్తే,నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు లొంగిపోయి మోకరిల్లినట్లుగా ఉందని ఆయన తెలిపారు.ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత ప్రజల దేశభక్తికి పరీక్ష పెట్టిన, నరేంద్ర మోడీ సర్కార్ అనుసరిస్తున్న విధానంపై అనేక అనుమానాలు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు.పాకిస్తాన్ సరిహద్దుకు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న పహల్గాం యాత్రికులపై టెర్రరిస్టులు అతికిరాతంగా దాడి చేసి హత్య చేసి,మాయం కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు.పటిష్టమైన నిఘా విభాగం, సైన్యం కలిగి యున్న ఎందుకు ఇలా జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీనాయకులు పరుచూరి శ్రీధర్, బి.భూమన్నా,నీలం సాయిబాబా,సూర్య శివాజీ,గౌతం కుమార్,శివకుమార్,సత్యం మార్క్స్,బాలయ్య,మల్లికార్జున్, సాయినాథ్,లక్ష్మి,సంజన,గోపాల్,సంజీవ్,ఏళ్ళన్న,మోహన్,నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు.... జిల్లా విద్యాధికారి రాజు

కరపత్రం ప్రతినిధి బాన్సువాడ మే 24




బాన్సువాడ పట్టణంలో అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అన్నారు. శనివారం బాన్సువాడ మండలంలోని బోర్లంలో ఆయన మాట్లాడుతూ అనుమతి లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఉచితవిద్యతోపాటు, దుస్తులు భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. బాన్సువాడ పట్టణంలో నూతనంగా ప్రైవేటు పాఠశాలాలు వెలిశాయని, ఇప్పటివరకు కొన్ని పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేవని, వాటిలో విద్యార్థులను చేర్పించవద్దన్నారు. ఇప్పటివరకు పాఠశాల అనుమతులు తీసుకొని వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్లైన్ లో దరఖాస్తు చేయనివారు, దరఖాస్తు చేసుకున్నట్లయితే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి




– ఎంఈఓ ఆనంద్ రావు...

కరపత్రం ప్రతినిధి ఏర్గట్ల మే 24 :

ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన అత్యుత్తముగా ఉన్నప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని,విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప స్థాయిలో ఉండడానికి ప్రాథమిక విద్య నిరంతరం ఉపయోగపడుతుందని,మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు అన్నారు.గత ఐదు రోజుల పాటు జరిగిన ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో అయన మాట్లాడుతూ,శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తప్పకుండా పాఠశాలలో ఆచరించాలని,విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాటుపడాలని అన్నారు.రాష్ట్ర విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమని ఉపాధ్యాయులకు గొప్ప వరం లాంటిదని తెలిపాడు.ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన మండల రిసోర్స్ పర్సన్స్ ఇమాముద్దీన్,గౌతమి ,ప్రియదర్శిని,అజయను అయన అభినందించారు.